క్లుప్తంగా

ఆర్థికసాయం



సుభాషిణికి చెక్కు అందజేస్తున్న ఎస్పీ రిశాంత్‌రెడ్డి

చిత్తూరు అర్బన్: పోలీసు శాఖలో విధులు నిర్వహిస్తూ మృతి చెందిన వారి కుటుంబాలకు గురువారం శాఖపరమైన ఆర్థికసాయాన్ని ఎస్పీ రిశాంత్‌రెడ్డి అందజేశారు. రమేష్‌బాబు సతీమణి సుభాషిణికి రూ.25 వేల ఫ్లాగ్ ఫండ్, రూ.50 వేల విడోఫండ్, సుబ్రమణ్యం పిల్లలకు కోవిడ్ ఫండ్ రూ.30 వేల చెక్కు అందజేశారు. పోలీసుశాఖ మృతుల కుటుంబాలకు అన్ని రకాల సహాయ సహకారాలను అందిస్తుందని ఆయన వారికి భరోసా కల్పించారు.

ఉపాధి పనుల్లో నిర్లక్ష్యం వద్దు

పూతలపట్టు: ఉపాధి హామీ పనుల్లో నిర్లక్ష్యం వద్దని డ్వామా పీడీ గంగాభవాని అన్నారు. గురువారం మండలంలోని వడ్డేపల్లెలో ఫీడర్ కాలువ పూడికతీత పనులను ఆకస్మిక తనిఖీ చేశారు. ఉపాధి కూలీలతో మాట్లాడి పనులపై అవగాహన కల్పించారు. మస్టర్లను క్షుణ్ణంగా పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ సౌభాగ్యవతి, జేఈ పరమశివ, టెక్నికల్ అసిస్టెంట్ మునిరత్నం, ఫీల్డ్ అసిస్టెంట్ పుష్పరాజ్ పాల్గొన్నారు.

సారా విక్రేత అరెస్టు



నిందితుడి అరెస్టు చూపుతున్న పోలీసులు

ఐరాల: సారా తయారు చేసి, అధిక ధరలకు విక్రయిస్తున్న వ్యక్తిని గురువారం పోలీసులు అరెస్టు చేశారు. ఎస్ఐ వెంకటేశ్వర్లు కథనం మేరకు.. మండలంలోని మొరంపల్లె పంచాయతీలోని కోమిటిగురవయ్యగారిపల్లెకు చెందిన హేమచంద్రబాబు తన ఇంటి వద్ద సారా తయారు చేసి, చుట్టుపక్కల ప్రజలకు అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీనిపై స్పందించిన ఎస్ఐ తన సిబ్బందితో కలసి ఆ ప్రాంతంలో దాడులు చేశారు. అతని వద్ద నుంచి ఐదు లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు.

రికార్డుల పరిశీలన



రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ గౌరి

పూతలపట్టు: మండలంలోని వావిల్‌తోట సచివాలయాన్ని గురువారం ఎంపీడీఓ గౌరి ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయ సిబ్బంది హాజరు పట్టిక, రికార్డులను పరిశీలించారు. సచివాలయంలోనే ప్రజా సమస్యలను పరిష్కరించాలన్నారు. జగనన్న కాలనీ పనులను వేగవంతం చేయాలని సిబ్బందికి సూచించారు. అనంతరం స్పందనలో వచ్చిన అర్జీలకు సంబంధించిన సమస్యలను పరిష్కరించారు.

ఉభయకర్తలు సహకరించాలి

తవణంపల్లె: కాళభైరేశ్వరస్వామి దేవస్థానంలో మహాశివరాత్రి ఉత్సవాల నిర్వహణకు ఉభయకర్తలు సహకరించాలని ఆలయ ఈఓ వెంకటసుబ్బారెడ్డి కోరారు. గురువారం సాయంత్రం కాళభైరేశ్వర ఆలయంలో ఉభయకర్తల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ వెంకటసుబ్బారెడ్డి మాట్లాడుతూ వచ్చే నెలలో జరగనున్న మహాశివరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమానికి ఉభయకర్తలు, గ్రామస్తులు కలసిరావాలని కోరారు.

ఎంపీడీఓ చొరవతో నీటి సమస్య పరిష్కారం

గంగాధరనెల్లూరు: స్థానిక ఎంపీడీఓ శ్రీదేవి చొరవతో తాగునీటి సమస్య పరిష్కారమైంది. వివరాల్లోకి వెళితే మహదేవమంగళం గ్రామంలో తాగునీటి బోరు పాడైపోయింది. గురువారం బోరు మరమ్మతుల కోసం పైపులు వెలికి తీసే వాహనాన్ని రప్పించారు. పక్కన ఉన్న భూమి నుంచి వాహనం వెళ్లడానికి ఆ పొలం యజమాని అంగీకరించకపోగా, వాహనాలను అడ్డుపెట్టి వెళ్లకుండా చేశారు. సమాచారం అందుకున్న ఎంపీడీఓ ఆ గ్రామానికి వెళ్లి, భూమి యజమానితో మాట్లాడి, వాహనం చేతి బోరు వద్దకు వెళ్లేందుకు చర్యలు తీసుకున్నారు. దీంతో సమస్య పరిష్కారమైంది.

మెరుగైన విద్యనందించండి

గంగాధరనెల్లూరు: విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలని ఎంఈఓ రాజేంద్రన్ కోరారు. మండలంలోని ఒడ్డుపల్లె, అప్పిరెడ్డికండ్రిగ, రామానాయుడుపల్లె ప్రాథమిక పాఠశాలల్ని గురువారం ఏపీఎం చిరంజీవితో కలసి ఆయన తనిఖీ చేశారు. రికార్డుల్ని పరిశీలించారు. విద్యార్థుల సామర్థ్యాన్ని పరీక్షించారు.

కాలనీలకు విద్యుత్ పరికరాలు

చిత్తూరు కార్పొరేషన్: ఉమ్మడి జిల్లాలోని జగనన్న కాలనీలకు విద్యుత్ పరికరాలు వచ్చాయని ట్రాన్స్‌కో నిర్మాణ విభాగం ఈఈ రమణ తెలిపారు. 160 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు 10, 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు 10, 63 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు 8 వచ్చాయన్నారు. అలాగే లబ్ధిదారులకు అందించే ఉచిత విద్యుత్ మీటర్లు 4 వేలు, కేబుల్ వైర్లు 60 వేల మీటర్లు జిల్లా స్టోర్‌కు చేరాయన్నారు. ఏఈలు వర్క్ ఆర్డర్లు పెట్టి పరికరాలు తీసుకోవాలని చెప్పారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

- ఎమ్మెల్యే ఎంఎస్ బాబు



కరిడివారిపల్లెలో లబ్ధిదారుకు సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

బంగారుపాళెం: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. మండలంలోని తిమ్మోజుపల్లె సచివాలయం పరిధిలోని కరిడివారిపల్లెలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల లబ్ధిని ఆయా కుటుంబాలకు వివరించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలకు అర్హత కలిగిన వారందరూ సచివాలయాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయన్నారు. పేదలకు ఇళ్ల స్థలాలతో పాటు పక్కాగృహాలు, ఇంటివద్దకే వైఎస్సార్ పింఛన్ కానుక, అమ్మఒడి, విద్యాకానుక, విద్యా దీవెన, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత తదితర పథకాలు పేదలకు వరంలా మారాయన్నారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశంలో ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు.

బాబు, పవన్‌కు పథకాలు కనిపించలేదా?

చంద్రబాబుకు, పవన్‌కళ్యాణ్‌కు ప్రభుత్వం అందిస్తున్న ప్రజా సంక్షేమ పథకాలు కనిపించడంలేదా? అని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు మండిపడ్డారు. గడపగడపకు కార్యక్రమం అనంతరం ఎమ్మెల్యే ఎంఎస్ బాబు మీడియాతో మాట్లాడారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాలలో భాగంగా అనేక సంక్షేమ పథకాలను తీసుకువచ్చారన్నారు. పేదలకు ఇస్తున్న పథకాలపై చంద్రబాబు ఎల్లోమీడియా ద్వారా అసత్య ప్రచారాలు చేయడం తగదన్నారు. పవన్‌కళ్యాణ్ చంద్రబాబు భజన చేసుకోవాల్సిందేనన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సలహామండలి జిల్లా చైర్మన్ రామచంద్రారెడ్డి, ఎంపీపీ అమరావతి, జెడ్పీ మాజీ చైర్మన్ కుమార్‌రాజా, జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్, సింగిల్ విండో చైర్మన్ దత్తాత్రేయరెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నేడు తిమ్మోజుపల్లెలో..

మండలంలోని తిమ్మోజుపల్లెలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎంఎస్ బాబు పర్యటించనున్నట్లు ఎంపీడీఓ హరిప్రసాద్ తెలిపారు. ఉదయం 9 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు.

అభివృద్ధి పనులకు స్టాండింగ్ కమిటీ ఆమోదం



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్

చిత్తూరు అర్బన్: నగరంలో పలు అభివృద్ధి పనులకు కార్పొరేషన్ పాలకవర్గం ఆమోదం తెలిపింది. మున్సిపల్ కార్పొరేషన్ స్టాండింగ్ కమిటీ సమావేశం నగరపాలక సంస్థ కార్యాలయంలో గురువారం సాయంత్రం మేయర్ అముద అధ్యక్షతన నిర్వహించారు. అజెండాలోని పలు అంశాలను పాలకవర్గం ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ సమావేశంలో కమిషనర్ అరుణ, స్టాండింగ్ కమిటీ సభ్యులు ఆర్.చంద్రశేఖర్, ఆర్‌జీ శ్రీకాంత్, బి.పూర్ణచంద్రరావు, సి.శోభ, ఏజీ సహదేవన్ తదితరులు పాల్గొన్నారు.

ఆమోదించిన అంశాలివీ..

– గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా 23, 24వ వార్డుల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి అర్హత ఉన్న బిడ్డర్లకు ఎల్‌ఓఏ జారీ చేయాలని స్టాండింగ్ కమిటీ ఆమోదించింది.

– 9వ వార్డు పరిధిలో లక్ష్మీనగర్ కాలనీలో రూ.40 లక్షలతో సిమెంట్ రోడ్ నిర్మాణానికి స్టాండింగ్ కమిటీ ఆమోదించింది.

– నగరపాలక సంస్థ పరిధిలో 50 వార్డుల్లో పవర్ బోర్లలో మరమ్మతుల సమయంలో మోటార్, పైపులను తీయడానికి లిఫ్టింగ్ వాహనం కొనుగోలు చేయడానికి స్టాండింగ్ కమిటీ ఆమోదించింది.

– ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్న హరిత నగరాల్లో భాగంగా కూడళ్లు, డివైడర్లలో వివిధ రకాల పనులు చేయడం కోసం 10 మంది వర్కర్లను నియమించుకోవడానికి స్టాండింగ్ కమిటీ ఆమోదించింది.

– ఏఎస్ఎం షాపింగ్ కాంప్లెక్స్‌లోని షాప్ రూమ్ నంబర్ 18కి వేలంపాటలో పాల్గొని గుడ్‌విల్ పాడిన మొత్తం మేరకు షాపు కేటాయించడానికి స్టాండింగ్ కమిటీ ఆమోదించింది.

– కొంగారెడ్డిపల్లె కూరగాయల మార్కెట్ వెనుకభాగంలో ఉన్న స్థలాన్ని లీజుకి ఇవ్వడం కోసం ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపడానికి స్టాండింగ్ కమిటీ ఆమోదించింది. సమావేశంలో సహాయ కమిషనర్ గోవర్ధన్, ఎంహెచ్ఓ లోకేష్, ఎంఈ ధనలక్ష్మి, ఏసీపీ రామకృష్ణుడు, మేనేజర్ ఉమామహేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

పశువుల మేత భూములను కాపాడండి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఐలవారిపల్లె గ్రామస్తులు

ఐరాల: మండలంలోని మొరంపల్లె రెవెన్యూ గ్రామంలో పశువుల మేత భూములను కాపాడాలని గురువారం ఐలవారిపల్లె గ్రామస్తులు తహసీల్దార్ సుశీలమ్మకు వినతిపత్రం అందజేశారు. గ్రామస్తులు మాట్లాడుతూ గుట్టలు, వంకలు, వాగులు వద్ద ఉన్న భూములను కొంతమంది కబ్జా చేశారన్నారు. ఆ భూమిని ఇళ్లు లేని నిరుపేదలకు పట్టాలు మంజూరు చేయాలని కోరారు. ఆ భూమలను సర్వే చేయించి, న్యాయం చేస్తామని తహసీల్దార్ తెలిపారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న దాతలు

తవణంపల్లె: మండలంలోని పైపల్లె క్రాస్‌లో ఉన్న జీఎఫ్ఐ చర్చిలో గురువారం ఆదివాసులకు దాతల సహకారంతో నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. పూతలపట్టు నియోజకవర్గంలోని సుమారు 250 మంది ఆదివాసులకు దాతలు ఎల్‌డీఎస్ సొసైటీ ఆధ్వర్యంలో నిత్యావసర వస్తువులను అందజేసి, తమ ఉదారతను చాటుకున్నారు. కార్యక్రమంలో దాతలు ఎల్‌డీఎఫ్ సొసైటీ ఆర్గనైజర్లు జాన్, గుత్తి, ఎల్‌వీ సునీల్, క్రిస్టోఫర్, జెడ్పీటీసీ సభ్యురాలు భారతి, జీఎఫ్ఐ చర్చి పాస్టర్ థియోస్టీఫెన్, అవుట్ రీచ్ డైరెక్టర్ ఆనంద్, ఎస్సీ,ఎస్టీ కమిటీ జిల్లా కోఆర్డినేటర్ కోదండపాణి, ఎంపీటీసీ సభ్యుడు డేవిడ్, వైఎస్సార్‌సీపీ నాయకుడు మధుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఖోఖో క్రీడాకారులకు జేసీ అభినందన



ఖోఖో క్రీడాకారులను అభినందిస్తున్న జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్

చిత్తూరు కలెక్టరేట్ : ఏపీ తరుపున జాతీయ ఖేలో ఇండియా పోటీల్లో పాల్గొననున్న ఖోఖో క్రీడాకారులను జేసీ వెంకటేశ్వర్ అభినందించారు. గురువారం స్థానిక మెసానికల్ మైదానంలో శిక్షణ పొందుతున్న ఖోఖో క్రీడాకారులను జేసీ పలకరించారు. జేసీ మాట్లాడుతూ క్రీడల్లో గెలుపోటములు సహజమని చెప్పారు. క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో జాతీయ స్థాయి పోటీల్లో రాణించాలన్నారు. చీఫ్ కోచ్ బాలాజీ మాట్లాడుతూ ఈ నెల 30 నుంచి ఫిబ్రవరి 4వ తేదీ వరకు మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్ లో జరిగే పోటీల్లో రాష్ట్ర ఖోఖో జట్టు పాల్గొంటుందన్నారు. ఖేలో ఇండియాలో భాగంగా పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఏపీ తరుపున పాల్గొంటున్న క్రీడాకారులు చిత్తూరులో శిక్షణ పొందుతున్నారన్నారు. వారికి కోచ్‌గా కాకినాడకు చెందిన పాపారావు వ్యవహరిస్తున్నారని తెలిపారు.

యోగి వేమన సేవలు మరువలేనివి

- ఘనంగా వేమన జయంతి
- పుష్పాంజలి ఘటించిన కలెక్టర్ హరినారాయణన్



చిత్తూరు కలెక్టరేట్‌లో వేమనకు పుష్పాంజలి ఘటిస్తున్న కలెక్టర్ హరినారాయణన్



జిల్లా పరిషత్ కార్యాలయంలో వేమన చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి

చిత్తూరు కలెక్టరేట్ : ప్రజాకవి, తాత్వికవేత్త వేమన సేవలు మరువలేనివని కలెక్టర్ హరి నారాయణన్ అన్నారు. యోగి వేమన జయంతి కార్యక్రమాన్ని కలెక్టరేట్‌లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కలెక్టర్, జాయింట్ కలెక్టర్ యోగి వేమన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. కలెక్టర్ మాట్లాడుతూ పామరులకు కూడా అర్థమయేలా వేమన పద్యాలు చెప్పి మెప్పించిన కవి అని అన్నారు. విశ్వదాభిరామ వినురవేమ అనే మాట వినని తెలుగు వారుండరని తెలిపారు. బ్రిటీష్ అధికారి సీపీ బ్రౌన్‌తోనే వేమన పద్యాలు వెలుగులోకి వచ్చాయన్నారు. జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్ మాట్లాడుతూ ఆటవెలదిలో అద్భుతమైన కవిత్వం, అనంత విలువలు గల సలహాలు, సూచనలు, తెలుగు సంగతులు ఇమిడ్చిన మహానుభావుడు వేమన అని అన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో రాజశేఖర్, ఏఓ కులశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

వేమనకు నివాళి

చిత్తూరు కార్పొరేషన్: మహాకవి యోగి వేమనకు జెడ్పీ కార్యాలయంలో గురువారం నివాళులర్పించారు. వేమన చిత్రపటం వద్ద జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ రమ్య తదితరులు పుష్పాంజలి ఘటించారు. వేమన గురించి తెలియని వారుండరని జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. పద్యాలతో మంచిని బోధించి, సమాజ శ్రేయస్సు కోసం ఎంతో కృషి చేసిన గొప్పకవి అన్నారు. సామాన్యుడికి అర్థమయ్యే భాషలో పద్యాలు రచించి సామాజిక రుగ్మతలపై అక్షర బాణాలను సంధించారన్నారు. తెలుగు సాహిత్య సామాజిక చరిత్రలో తనదైన ముద్ర వేసి, అరుదైన స్థానం పొందిన మహనీయుడన్నారు. కార్యక్రమంలో పీఆర్ ఈఈ చంద్రశేఖర్, పీఐయూ ఈఈ రమణయ్య, డీపీఆర్సీ డీసీ షణ్ముగం తదితరులు పాల్గొన్నారు.

వేమన పద్యాలు..చైతన్య దీపికలు

ఐరాల: వేమన పద్యాలు సమాజానికి చైతన్యదీపికల వంటివని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బుజ్జిరెడ్డి అన్నారు. గురువారం యోగి వేమన జయంతి సందర్భంగా పుత్రమద్ది జెడ్పీ హైస్కూల్‌లో బుజ్జిరెడ్డి ఆధ్వర్యంలో వేమన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన పద్య రచన శైలితో యోగివేమన అందరినీ చైతన్యవంతులను చేశారని, వేమన పద్యాలతో నేటితరం వారికి స్ఫూర్తిదాయకంగా ఉన్నందున వేమన పద్యాల సారాంశాలను గ్రహించాలన్నారు. అనంతరం విద్యార్థులకు వేమన పద్యాల పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు మోహన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా వేమన జయంతి

పూతలపట్టు: మండలంలో యోగి వేమన జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. మండలంలోని సంజీవరాయనికాలనీలోని అంబేడ్కర్ గురుకుల పాఠశాలలోని విద్యార్థులు, ఉపాధ్యాయులు వేమనకు నివాళులు సమర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సీఎస్ ప్రసాద్ మాట్లాడుతూ వేమన ప్రజాకవి, సంఘసంస్కర్త అయిన ఆయన రాసిన పద్యాల్లో ఉన్న ప్రజాదరణ వెలకట్టలేనిదని తెలిపారు. అనంతరం వేమన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు భాస్కరబాబు, దశకంఠశాస్త్రి, వెంకటరమణ, గణేష్, నాగరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.



పూతలపట్టులో వేమనకు నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



ఐరాల: నివాళులర్పిస్తున్న బుజ్జిరెడ్డి

గ్రామాల్లో పనులు వేగవంతం చేయండి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరినారాయణన్

చిత్తూరు కలెక్టరేట్ : నేచురల్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ పథకం ద్వారా ఎంపిక చేసిన గ్రామాల్లో పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ హరినారాయణన్ అన్నారు. గురువారం జిల్లాలో డ్వామాశాఖ ద్వారా అమలు జరుగుతున్న కార్యక్రమాల పనితీరుపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎన్ఎంఎంఎస్ పథకంలో చేపడుతున్న పనులను వేగవంతం చేసి మరింత ఎక్కువమందికి ఉపాధి కల్పించాలన్నారు. గృహ నిర్మాణ పథకంలో మరింత ఎక్కువ మందికి పని కల్పించాలని ఆదేశించారు. ఉపాధి హామీలు పనిచేసే వారికి ఎట్టి పరిస్థితుల్లోనూ రోజువారీ వేతనం రూ.246 తగ్గకుండా చూడాలని తెలిపారు. అమృత్ సరోవర్ ప్రాజెక్టు కింద జిల్లాకు 70 ప్రాజెక్టులు మంజూరు అయ్యాయని చెప్పారు. ఇప్పటివరకు 31 ప్రాజెక్టులు పూర్తి అయ్యాయని తెలిపారు. మిగిలినవి వెంటనే పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈ సమీక్ష సమావేశంలో డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ గంగాభవాని, ఏపీడీలు సుబ్రహ్మణ్యం, శ్రీనివాసులు, వరప్రసాద్, వెంకటరత్నం, శోభన్ బాబు, ప్రియదర్శిని, జయచంద్ర, చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

బరువు తక్కువ ఉన్న పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టండి

జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో బరువు తక్కువ ఉన్న పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కలెక్టర్ ఐసీడీఎస్ అధికారులను ఆదేశించారు. ఆయన మాట్లాడుతూ గర్భిణులు ఆరోగ్యవంతమైన శిశు జననానికి, వారు తీసుకోవాల్సిన పోషకాహారం, జాగ్రత్తలపై అంగన్‌వాడీ కార్యకర్తలు మరింత శ్రద్ధ చూపాలన్నారు. సీడీపీఓలు వారి విధులను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లల్లో ఎత్తు, బరువు తక్కువ ఉన్న పిల్లల ఆరోగ్య పరిస్థితులకు సంబంధించి చిన్నపిల్లల వైద్యనిపుణుల సూచనలతో వారి ఆరోగ్యం మెరుగుదలకు చర్యలు చేపట్టాలన్నారు. వైద్యుల సూచనలు మేరకు ప్రతి నెలా పిల్లలు బరువు పెరిగేలా వారికి అవసరమైన పోషకాహారం అదనంగా అందించేందుకు కృషి చేయాలన్నారు. సీడీపీఓలు వారి పరిధిలో బరువు తక్కువ ఉన్న పిల్లలను, రక్తహీనత ఉన్న గర్భిణుల ఇళ్లకు వెళ్లి వారి ఆరోగ్య స్థితిగతులను తెలుసుకోవాలన్నారు. వారికి అవసరమైన వైద్య సలహాలు ఏఎన్ఎం, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్త సాయంతో అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. బాల్య వివాహాలను నిర్మూలనకు సచివాలయ స్థాయిలో మహిళా పోలీస్, పంచాయతీ కార్యదర్శి, వీఆర్వో కృషి చేయాలన్నారు. బాల్య వివాహాలతో ఆడపిల్లల్లో తలెత్తే ఆరోగ్య సమస్యలపై అవగాహన పెంచాలని కలెక్టర్ సూచించారు.

రహదారి నియమాలు పాటించాలి



వాహనచోదలకు అవగాహన కల్పిస్తున్న ఎంవీఐ శివారెడ్డి



బంగారుపాళెంలో వాహనచోదకులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న రవాణాశాఖాధికారులు

బంగారుపాళెం: వాహనచోదకులు రహదారి నియమాలు పాటించి, ప్రాణాలు కాపాడుకోవాలని మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు మధుసూదన్, మురళి అన్నారు. రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా గురువారం బంగారుపాళెంలో రవాణాశాఖ ఆధ్వర్యంలో వాహనచోదకులకు రహదారి నియమాలపై అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ వాహనచోదకులు వాహనాలు నడిపే సమయంతో తగిన జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదాలు జరగవన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, ద్విచక్రవాహన చోదకులు హెల్మెట్ పెట్టుకోకపోవడం, కారులో ప్రయాణించే వారు సీటు బెల్టు ధరించకుండా ప్రయాణిస్తే భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందన్నారు. అనంతరం రహదారి భద్రత ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు శివకుమార్, ఇస్మాయిల్, గాయత్రి పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి

గుడిపాల: వాహనచోదకులందరూ రహదారి నియమాలు పాటించాలని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శివారెడ్డి సూచించారు. జాతీయ రహదారి వారోత్సవాల్లో భాగంగా గురువారం 189 కొత్తపల్లె జాతీయ రహదారి వద్ద ప్రయాణికులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రహదారులు నిత్యం రక్త సిక్తమవుతూనే ఉన్నాయని, ద్విచక్రవాహన చోదకులు హెల్మెట్ ధరించకపోవడం, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపడం, కార్లలో సీట్ బెల్ట్ పెట్టుకోకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శ్వేత పాల్గొన్నారు.

దుకాణాలు.. హోటళ్లపై దాడులు



కొంగారెడ్డిపల్లెలోని హోటళ్లను తనిఖీ చేస్తున్న కమిషనర్ జె అరుణ

చిత్తూరుఅర్బన్: నగరంలోని ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, హోటళ్లు, చికెన్ సెంటర్లపై నగరపాలక ప్రజారోగ్య విభాగం అధికారులు గురువారం రాత్రి దాడులు చేశారు. నగరంలో హోటళ్లపై ఇటీవల ఫిర్యాదుల రావడంతో గురువారం రాత్రి కొంగారెడ్డిపల్లె పరిధిలోని పలు హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, చికెన్ సెంటర్లపై మున్సిపల్ కమిషనర్ అరుణ ఆధ్వర్యంలో ఎంహెచ్ఓ లోకేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆకస్మిక దాడులు చేశారు. వంటశాలలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పనిచేసే సిబ్బంది వ్యక్తిగత శుభ్రత పాటించాలని హెచ్చరించారు. మాంసం, తమ ఇతర ఆహార ఉత్పత్తులను ఫ్రిజ్‌ల్లో ఉంచితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో ఫుడ్ కలర్స్, ఇతర హానికర పదార్థాలు నిబంధనలు అతిక్రమించి, వినియోగించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లను మూయిస్తామని హెచ్చరించారు. కొన్నింటికి నోటీసులు జారీ చేశారు. సింగిల్ యూస్ ప్లాస్టిక్‌ను వినియోగించకూడదన్నారు.శానిటరీ ఇన్‌స్పెక్టర్లు చిన్నయ్య, లోకనాథం, నరసింహ పాల్గొన్నారు.

ప్రతి గడపలో సంతోషం కనిపిస్తోంది

– ఎమ్మెల్సీ భరత్



కోదండాచారిని పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ భరత్

శాంతిపురం: ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతో పేద, మధ్యతరగతి కుటుంబాలు కూడా అభివృద్ధి బాటలో సాగుతుండడంతో ప్రతి గడపలో సంతోషం కనిపిస్తోందని ఎమ్మెల్సీ భరత్ చెప్పారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గురువారం ఆయన 64 పెద్దూరు, సోమాపురం గ్రామాల్లో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ఆయా కుటుంబాలకు అందిన పథకాల వివరాలతో ఉన్న బుక్‌లెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ కుటుంబాన్ని ఆరా తీసినా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో తమకు రూ.లక్షల్లో కలిగిన లబ్ధిని ఆనందంగా వివరిస్తున్నారని చెప్పారు.

టీడీపీలో క్రియాశీలకంగా ఉన్న వారి కుటుంబాలకు కూడా గతంలో ఎన్నడూ లేనివిధంగా సంక్షేమ లబ్ధి చేకూరడంతో వారు కూడా అంతర్మథనంలో పడ్డారన్నారు. ఎన్నికల మేనిఫెస్టోను భగవద్గీత, కురాన్, బైబిల్‌గా భావించి సీఎం జగనన్న హామీలను అమలు చేస్తున్నారని చెప్పారు. అందుకే ప్రజలు మూకుమ్మడిగా సీఎంకు అండగా నిలుస్తున్నారని, ఇతర పార్టీల నుంచి పెద్దఎత్తున వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారని తెలిపారు. 64పెద్దూరులో మురుగుకాలువ సమస్యను స్థానికులు ఎమ్మెల్సీ దృష్టికి తీసుకురాగా, తక్షణం సమస్య పరిష్కారానికి నిధులు మంజూరు చేస్తున్నట్టు ప్రకటించారు. అదే గ్రామంలో పక్షవాతం బారిన పడిన కోదండాచారిని పరామర్శించి మెరుగైన వైద్యం పొందేందుకు ప్రభుత్వం ద్వారా, తనవంతు సాయం చేస్తామని హామీ ఇచ్చారు.

పౌష్టికాహారంతో రక్తహీనతకు చెక్



రోగుల్ని పరీక్షిస్తున్న డాక్టర్ ప్రశాంత్

గంగాధరనెల్లూరు: పౌష్టికాహారంతో రక్తహీనతను నివారించవచ్చని తూగుండ్రం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ప్రశాంత్ తెలిపారు. మండలంలోని వేపంజేరిలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి దీర్ఘకాలిక రోగులకు వైద్యపరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. అనంతరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు రక్తహీనతపై అవగాహన కల్పించారు. హిమోగ్లోబిన్ 13 గ్రాముల నుంచి 16 గ్రాముల వరకు ఉండాలన్నారు. అందకన్నా తక్కువ ఉంటే రక్తహీనత ఉన్నట్లు గుర్తించాలన్నారు. రక్తహీనత లోపిస్తే వ్యాధినిరోధక శక్తి తగ్గిపోతుందన్నారు. తద్వారా పలు వ్యాధులు సోకే ప్రమాదం ఉందన్నారు. అనంతరం ఐరన్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్యవిద్యాధికారి రాజేంద్రప్రసాద్, సూపర్‌వైజర్ కృష్ణమ్మ, సీహెచ్ఓ గౌతమి పాల్గొన్నారు.